క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

నకిరేకల్ (శాలిగౌరారం) : శాలిగౌరారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ఖాళీగా ఉన్న హిందీ సీఆర్‌టీ అతిథి ఉపాధ్యాయ (గెస్ట్ టీచర్) పోస్టుకు అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని విద్యాలయం ప్రత్యేక అధికారి ఉమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు ప్రస్తుత విద్యా సంవత్సరానికి మాత్రమే పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు రెండు రోజుల్లో స్థానిక కేజీబీవీలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



పట్టుబడిన వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ గిరిబాబు

మర్రిగూడ : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను దేవరకొండ డీఎస్పీ జి.గిరిబాబు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసెప్షన్ కేంద్రం, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పోలీస్ సిబ్బంది శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సూబ్ క్రైమ్, మాదకద్రవ్యాల నియంత్రణ గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, పెండింగ్ కేసులపై నిర్లక్ష్యం వహించకుండా సత్వరమే పరిష్కరించాలన్నారు. ఆయన వెంట నాంపల్లి సీఐ ఎ.నవీన్‌కుమార్, ఎస్‌ఐ మునగాల కృష్ణారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు మంజుల

కేతేపల్లి : మండలంలోని కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు లేజర్ కంటి వైద్యశాల నకిరేకల్ వారి ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వి.రాధాకృష్ణమాచార్యులు, వైద్యురాలు ఎ.మంజుల, పీఎస్ హెచ్‌ఎం సంధ్యలత, ఉపాధ్యాయులు పి.నాగయ్య, సైదులు, శంకరయ్య, గోవర్ధన్, శ్రీలత, నమీనాబేగం, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బీటీరోడ్డు పనులు ప్రారంభం

చండూరు : మండలం పరిధిలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పడమటి తాళ్ల గ్రామం వరకు నిర్మించే బీటీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కావలి అంజనేయులు, మాజీ ఎంపీటీసీ గంట అనురాధ సత్యం, గంట తులశయ్య, గంట నర్సింహ, మల్లేశం, రామస్వామి, శ్రీరాములు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పులిపలుపుల వాసికి డాక్టరేట్



సత్యనారాయణను అభినందిస్తున్న తల్లిదండ్రులు

మునుగోడు : మండలంలోని పులిపలుపుల గ్రామానికి చెందిన కంభంపాటి సత్యనారాయణ గణితశాస్త్రంలో డాక్టరేట్ పట్టా పొందాడు. ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ చెన్న కృష్ణారెడ్డి పర్యవేక్షణలో గణితశాస్త్రంలో న్యూమరికల్ స్టడీ ఆఫ్ టూ పారామీటర్స్ సింగులర్ పెర్టర్బేషన్ బౌండరీ వాల్యూప్రాబ్లమ్స్ విత్ లేయర్ బిహేవియర్ అనే అంశంపై అధ్యయనం చేసినందుకు గాను డాక్టరేట్ అందుకున్నట్లు మంగళవారం వెల్లడించారు. ఈ సందర్భంగా అతడిని తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

కేతేపల్లి : అపరిష్కృతంగా ఉన్న సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కంచర్ల మహేందర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో సమగ్రశిక్ష ఉద్యోగులు ఎంఈఓ రాంజేంద్ర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సమగ్రశిక్ష ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ఏడాదైనా అమలుకు నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో హరికుమార్, ఎ.మల్లయ్య, పొన్న సైదులు, రాజేందర్, సునీత, వివిధ సంఘాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



నల్లగొండ : ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్ చిత్రంలో మున్సిపల్ చైర్మన్, అధికారులు

నల్లగొండ : పట్టణంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మహిళా శిశు, వికలాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డీఆర్‌ఓ అమరేందర్ మాట్లాడారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా స్థాయిలో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా జిల్లా సంక్షేమ అధికారిణి కేవీ కృష్ణవేణి మాట్లాడారు. అనంతరం దివ్యాంగులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, అదనపు జిల్లా వైద్యాధికారి కళ్యాణ్‌చక్రవర్తి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి విమల, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు, సీడీపీఓలు లావణ్య, అంజు, ఉదయశ్రీ, హరిత తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ : పట్టణంలోని భవిత కేంద్రంలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మేకల నాగయ్య, స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం రాములు, కేంద్రం ఉపాధ్యాయులు చల్లోజు శ్రీనివాస్, సబితా, అంబికా, ఫరీదా, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బి.ప్రకాష్‌రావు, నవ్య క్లబ్ అధ్యక్షుడు ఎస్.రమాదేవి, ప్రతినిధులు డాక్టర్ వీరబ్రహ్మం, సూర్యచంద్రారావు, పాల్గొన్నారు.

దివ్యాంగులపై ప్రేమ చూపాలి

నకిరేకల్ (శాలిగౌరారం) : దివ్యాంగుల పట్ల ప్రతిఒక్కరూ ప్రేమ చూపాలని ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి అన్నారు. మంగళవారం శాలిగౌరారం మండల కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఎమ్మార్సీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎంపీడీఓ పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సైదులు, ఎంపీఓ పద్మ, డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్, స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం మల్లయ్య, ఐఈఆర్‌పీలు భిక్షమయ్య, గీత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కనగల్ : మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వల్లపట్ల పద్మ పాల్గొని మాట్లాడారు. అనంతరం నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్పీ తిరందాసు సంతోష్‌కుమార్, ప్రవీణ్, హెచ్‌ఎం సునీత, ఐఈఆర్పీ పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికే భవిత కేంద్రాలు

కట్టంగూర్ : దివ్యాంగుల సంక్షేమం కోసమే ప్రభుత్వం భవిత కేంద్రాలు ఏర్పాటు చేసిందని ఎంఈఓ అంబటి అంజయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌లో గల ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆటపాటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఇందిర, ఫిజియోథెరపిస్ట్ భవానీ, వి.వెంకన్న తదితరులు ఉన్నారు.

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

మర్రిగూడ : దివ్యాంగులు ప్రతిభ చాటి అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈఓ బిట్టు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని శివన్నగూడ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భిక్షం, ఐఈఆర్పీ రమేష్, సీడీఓలు చంద్రయ్య, బిచ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల : పట్టణంలోని భవిత కేంద్రంలో మంగళవారం వివేరా హోటల్ యాజమాన్యం ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం భవిత కేంద్రానికి వివేరా యాజమాన్యం బోధనాభ్యాస సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ పి.సైదానాయక్, పీఎస్ హెచ్‌ఎం అంబటి సత్తయ్య, వివేరా హోటల్ యాజమాన్యం కావ్య, భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు ఆవుల గీత ఉన్నారు.



నకిరేకల్ : ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



కనగల్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ పద్మ



మర్రిగూడ : సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాస్

అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ త్రిపాఠి, అధికారులు

నల్లగొండ : అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 3నుంచి 9వతేదీ వరకు నిర్వహించే వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం స్థానికంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడారు. అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల్లో అవినీతికి తావులేకుండా చూడాలన్నారు. తెలంగాణ సీఎం కలలుగన్న బంగారు తెలంగాణకు అవినీతి రహిత సమాజం దారి చూపుతుందన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, చట్టవిరుద్ధమైన మార్గాల్లో పనిని పొందడానికి మధ్యవర్తులు అవినీతికి పాల్పడే అవకాశాన్ని అరికట్టాలని సూచించారు. ఈ వారోత్సవాల్లో భాగంగా పాఠశాల, ఇంటర్మీడియట్ కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో అధికారులు జగదీష్‌చందర్, వెంకట్‌రావు, రామారావు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం



డ్రెయినేజీ, రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

చిట్యాల : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళవారం మండలంలోని నేరడ గ్రామంలో రూ.10లక్షలతో నిర్మించే డ్రెయినేజీ నిర్మాణానికి, రూ.4లక్షలతో నిర్మించే మట్టిరోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, నర్రా మోహన్‌రెడ్డి, బట్టు ఐలేష్, దుబ్బాక అమరేందర్‌రెడ్డి, రజనీకాంత్, లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

5న జర్నలిస్టులకు హెల్త్ క్యాంపు

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఈ నెల 5వ తేదీన మెగా హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు మలక్‌పేట యశోద హాస్పిటల్స్ సీనియర్ మేనేజర్ వాసుదేవరెడ్డి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రెస్‌క్లబ్ నల్లగొండ ఆధ్వర్యంలో.. యశోద హాస్పిటల్స్ సౌజన్యంతో 5వ తేదీన నల్లగొండలోని టీఎన్‌జీఓస్ భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచితంగా మెగా హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్డియాలజీ, ఆర్థోపెడిక్, గైనిక్, ఈసీజీ, టూడీ ఈకో, బీఎండీ బోన్ మినరల్ టెస్ట్, షుగర్, బీపీ తదితర పరీక్షలు చేస్తారన్నారు. సమావేశంలో ప్రెస్‌క్లబ్ మీడియా సెక్రటరీ కిరణ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అశ్వాక్ మహ్మద్, ఆస్పత్రి అసిస్టెంట్ మేనేజర్ సాజిద్ పాల్గొన్నారు.

అదాని అవినీతిపై నోరుమెదపని మోదీ

మిర్యాలగూడ : అదాని అవినీతి అక్రమాలపై పార్లమెంట్‌లో విపక్ష సభ్యులు గగ్గోలు పెడుతున్నా ప్రధానమంత్రి మోదీ నోరు మెదపడం లేదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ఆరోపించారు. మంగళవారం ఆయన స్థానిక బృందావన్ గార్డెన్స్‌లో విలేకరులతో మాట్లాడుతూ అన్ని దేశాల్లో అదాని అవినీతికి పాల్పడిన విషయం తేలి అమెరికాలో కేసు నమోదు కాగా దేశ పార్లమెంట్‌లో అదాని అవినీతిపై చర్చ జరగాలని విపక్షాలు కోరుతున్నా మోదీ మాత్రం నోరు మెదపడంలేదన్నారు. అదేవిధంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ మోదీ దివాళాకోరు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాప్రయోజనాలను కాలరాస్తున్న బడా పెట్టుబడిదారులకు వంత పాడుతున్నారని ఆరోపించారు.

శ్రీకాంతాచారి ప్రాణత్యాగంతోనే ప్రత్యేక రాష్ట్రం



నకిరేకల్ : శ్రీకాంతాచారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం



నల్లగొండ టూటౌన్ : శ్రీకాంతాచారి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : అమరుడు శ్రీకాంతాచారి ప్రాణత్యాగంతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో కాసోజు శ్రీకాంతాచారి 15వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని స్థానిక గడియారం సెంటర్‌లో గల శ్రీకాంతాచారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అభిమన్యు శ్రీనివాస్, బోనగిరి దేవేందర్, సింగం రామ్మోహన్, మారగోని గణేష్, జమాల్ ఖాద్రీ, రంజిత్, కౌకూరి వీరాచారి, శ్రీనివాస్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, గోపి తదితరులు పాల్గొన్నారు.

బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో

పట్టణంలో తెలంగాణ మలిదశ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి వర్ధంతిని మంగళవారం బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపేందర్, జిల్లా కార్యదర్శి ఎలిజాల వెంకటేశ్వర్లు, విశ్వనాధుల శివకుమార్, బోళ్ల నాగరాజు, వనం వెంకటేశ్వర్లు, వీరాచారి, సాయి, కిషోర్ పాల్గొన్నారు.

నల్లగొండ : పట్టణంలో తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ పాల్గొని స్థానిక గడియారం సెంటర్‌లో గల శ్రీకాంతాచారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముస్తాక్ హైమద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నకిరేకల్ : పట్టణంలో కార్పెంటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నకిరేకంటి ఏసుపాదం, మాజీ సర్పంచ్ పన్నాల రంగమ్మరాఘవరెడ్డి, కౌన్సిలర్లు గాజుల సుకన్య, కందాల భిక్షంరెడ్డి, రాచకొండ సునీల్‌గౌడ్, రాములమ్మ, అఖిల, సునీత, వెంకన్న, లక్ష్మి, వెంకన్న పాల్గొన్నారు.

శ్రీకాంతాచారి త్యాగం మరువలేనిది

మునుగోడు : తెలంగాణ రాష్ట్ర సాధన మలిదశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి త్యాగం ఎప్పటికీ మరువలేనిదని, ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గుంటోజు వెంకటచారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీరామోజు శ్రీనివాసచారి, చొల్లేటి నవీన్, బైరోజు నారాయణ, అనంతచారి, మల్లాచారి, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ : శ్రీకాంతాచారి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



మునుగోడు : శ్రీకాంతాచారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విశ్వకర్మ సంఘం నాయకులు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

నల్లగొండ రూరల్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఎన్‌ఎస్‌ఎస్ రీజనల్ డైరెక్టర్ సైదానాయక్ అన్నారు. మంగళవారం నల్లగొండ రైల్వేస్టేషన్‌లో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు స్వచ్ఛత కార్యాక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు రద్దీగా ఉండే బస్టాండ్, రైల్వేస్టేషన్లను, ఆస్పత్రులను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌జీ కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్, మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మునుగోడు : మండలంలోని చొల్లేడు గ్రామానికి చెందిన నిరుపేద బుడిగపాక అంజయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలకు కుటుంబానికి గ్రామ కాంగ్రెస్ నాయకులు మంగళవారం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. అంతకు ముందు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. వారిలో బుడిగపాక రవి, జనిగల సైదులు, వనం యాదయ్య, గోధాల శంకర్‌రెడ్డి, జనిగల ముత్యాలు, చిలుముల రుద్రయ్య, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల కమిటీ ఎన్నిక

మర్రిగూడ : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల స్థాయి సమావేశాన్ని మంగళవారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరుగు శ్రీశైలం, ఎంఎస్పీ జిల్లా కార్యదర్శి బకారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ముదికొండ రమేష్, ఎంఎస్పీ మండల అధ్యక్షులుగా మైలారపు రాజు, జిల్లా నగేష్, ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధిగా జిల్లా రవి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జిల్లా తిరుమలేష్, రాష్ట్ర సోషల్ మీడియా కోకన్వీనర్ యాచారం శివకుమార్, సత్తయ్య, మహేందర్, నక్క కృష్ణ పాల్గొన్నారు.

తెలంగాణలో ఇందిరమ్మ పాలన సాగుతుంది

- ఎమ్మెల్యే వేముల వీరేశం



నకిరేకల్ : ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం, మహిళలు

నకిరేకల్ : తెలంగాణలో ఇందిరమ్మ పాలన సాగుతుందని, ఈ పాలనలో ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ లేని రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా స్థానిక మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మహిళా సంఘాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మహిళా సంఘాల సభ్యులకు చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యం వస్తే వడ్డీ లేని రుణాలు ఇస్తామని అనాడు ఎన్నికల ముందు హామీ ఇచ్చామని, ఆ హామీలను నేడు నెరవేరుస్తున్నామన్నారు. గడిచిన బీఆర్‌ఎస్ 10ఏళ్ల పాలనలో కేసీఆర్ రూ.7లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. నియోజకవర్గానికి 3500ఇళ్లు మంజురు అయ్యాయని తెలిపారు. త్వరలో నిర్మాణంలో ఉన్న 100పడకల ఆస్పత్రి భవనం నిర్మాణం పనులు పూర్తి చేయించి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందికి ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, కమిషనర్ బాలయ్య, మెప్మా అధికారిణి పద్మ, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నకిరేకంటి ఏసుపాదం, మాజీ సర్పంచ్ పన్నాల రంగమ్మ రాఘవరెడ్డి, వార్డు కౌన్సిలర్లు గాజుల సుకన్య, కందాల భిక్షంరెడ్డి, రాచకొండ సునీల్‌గౌడ్, చౌగోని రాములమ్మ, అఖిల, సునీత, వెంకన్న, లక్ష్మి, వెంకన్న, స్వామి పాల్గొన్నారు.

మహిళలకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

నల్లగొండ టూటౌన్ : మహిళలకు ఉపాధి కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మెప్మా కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన శ్రీకనకదుర్గ ఇందిరా మహిళా క్యాంటిన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ప్రజాపాలన ఉత్సవాలను పురస్కరించుకొని మహిళా సంఘాలకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ టూటౌన్ : చెక్కు అందజేస్తున్న చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్, అధికారులు



చిట్యాల : ర్యాలీలో పాల్గొన్న అధికారులు, మున్సిపల్ సిబ్బంది, కార్మికులు

కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని శ్రీనగర్‌కాలనీ పార్కులో కార్మికులకు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కమిషనర్ ముసాబ్ అహ్మద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రజా పాలన విజయోత్సవ ర్యాలీ

చండూరు : మున్సిపాలిటీలో ప్రజా పాలన విజయోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ డే, మహిళా సంఘం సభ్యులతో రంగోళి కార్యక్రమం చేపట్టారు. అనంతరం మున్సిపల్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీదేవి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చిట్యాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వీరేందర్, మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం మున్సిపాలిటీలో మున్సిపల్ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బందికి సన్మానం, హెల్త్ క్యాంపు, మహిళా సంఘాలకు రుణాల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు బెల్లి సత్తయ్య, జయమ్మ, శ్రీనివాసరెడ్డి, జడల పూలమ్మ, చిన మల్లయ్య, రెముడాల లింగస్వామి, కోనేటి కృష్ణ, జిట్టా పద్మ, బొందయ్య నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు



భూములను పరిశీలిస్తున్న అన్నెపర్తి సులోచన

చిట్యాల : దేవాలయ, ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ అన్నెపర్తి సులోచన హెచ్చరించారు. చిట్యాల మండలం పెద్దకాపర్తిలో భూముల ఆక్రమణపై ఇటీవల ఎమ్మార్పీఎస్ నాయకులు కలెక్టర్, రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఆమె ఆ గ్రామంలోని తిరుమలనాథస్వామి దేవాలయ, ప్రభుత్వ భూములను తహసీల్దార్ కృష్ణనాయక్, డివిజన్ అధికారి బి.సుమతి, ఈఓ అంబటి నాగిరెడ్డితో కలిసి పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న హోటల్, ఇతర కంపెనీ పనులు నిలిపివేయాలని మౌఖికంగా ఆదేశించారు. సర్వే చేసి ప్రభుత్వ, దేవాదాయ భూములకు హద్దులు ఏర్పాటు చేసేంత వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పొట్టపల్లి చిన్నస్వామి, చేకూరి గణేష్, ఏర్పుల రాకేష్, మాచర్ల యాదగిరి, ఏర్పుల దామోదర్, గణేష్, చింతకింది అజయ్, సునీల్, శ్రీనాథ్, మహేష్ ఉన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



యోగాసనం చేస్తున్న భజరంగ్ ప్రసాద్

చిట్యాల : నిత్యం యోగా చేయడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంఈఓ సైదానాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయుష్ డిపార్ట్‌మెంట్ హోమియో డిస్పెన్సరీ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువు పట్ల ధ్యాస నిలుపుకునేందుకు ధ్యానాన్ని సాధన చేయాలని సూచించారు. ఈ సందర్భంగా యోగా శిక్షకులు భజరంగ్‌ప్రసాద్, వైష్ణవి పలు యోగాసనాలు ప్రదర్శించి వాటి ఉపయోగాలు, ఫలితాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.మాధవి, హోమియో వైద్యాధికారి తయ్యబా, ఫిజికల్ డైరెక్టర్ జానకి, ఉపాధ్యాయులు మధుమతి, కోణం శ్రీనివాస్, పద్మజ, కవిత, సైదులు, ప్రసన్న, శైలజ, శ్రీనివాస్, శంకరయ్య, సౌమ్య, శ్రీనివాస్, తిరుమల ఉన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తాం

నల్లగొండ రూరల్ : ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందస్తామని ఆర్‌ఎం కె.జానిరెడ్డి అన్నారు. నిజామాబాద్ నుంచి బదిలీపై వచ్చి నల్లగొండ ఆర్‌ఎంగా మంగళవారం బాధ్యతలు చేపట్టి మాట్లాడారు. అనంతరం ప్రయాణికుల సమస్యలు, ఆర్టీసీ అందిస్తున్న సేవలు, రద్దీ ప్రాంతాల రూట్‌లపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ పనిచేసిన రాజశేఖర్ సికింద్రాబాద్‌కు బదిలీ అయ్యారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

మునుగోడు : ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఫర్టిలైజర్ వ్యాపారులు రైతులకు ఎరువులను విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మునుగోడు ఏడీఏ వేణుగోపాల్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మునుగోడు, చండూరు మండలాలకు చెందిన ఫర్టిలైజర్ వ్యాపారులకు ఎరువుల విక్రయంపై ఆయన అవగాహన కల్పించారు. మునుగోడు, చండూరు మండలాల్లోని భూముల్లో భాస్వారం నిల్వలు అధికంగా ఉన్నందున సూటి ఎరువులు (యూరియా, పీఎస్‌బీ) లాంటివి వినియోగిస్తే రైతులకు ఖర్చులు తగ్గడంతో పాటు పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. డీఏపీ వినియోగం పూర్తిగా తగ్గించాలని సూచించారు. సమావేశంలో అధికారులు పద్మజ, బి.చంద్రిక, వ్యాపారులు పాల్గొన్నారు.